క్లుప్తంగా

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

ధర్మపురి: మండలంలోని జైనా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని 315 మంది రైతులకు 1,95,24,739 రూ.ల రుణమాఫీ అయిందని పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో ఆదివారం సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి రైతులు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మూల మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు గంగారెడ్డి, సాయిని లక్ష్మి, గంగమల్లయ్య, సర్పంచ్‌లు కుడిక్యాల మహేష్, ఎన్నం లక్ష్మారెడ్డి, నాయకులు ప్రేమ్ చందర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో శాంతిభద్రతలు పరిరక్షించాలి


వినతిపత్రం అందిస్తున్న విజయ్‌ఆజాద్

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కొమొరెడ్డి విజయ్ ఆజాద్ హైదరాబాద్‌లో హోం మంత్రి మహమూద్ అలీని కలిసి విజ్ఞప్తి చేశారు. వరుసగా జరుగుతున్న హత్యలతో నియోజకవర్గ ప్రజలు భయాందోళన చెందుతున్నారని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. నెల రోజుల వ్యవధిలోనే నలుగురి హత్యలు జరిగినప్పటికీ స్థానిక పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదని వివరించారు. అలాగే కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు రజాక్ హత్య నిందితులను కఠినంగా శిక్షించి ప్రభుత్వపరంగా ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రీతూచౌదరి, అరవింద్, సజ్జత్ హుస్సేన్ తదితరులున్నారు.

పేదింటి అమ్మాయి వివాహానికి సాయం


సామగ్రి అందిస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: పేదింటి అమ్మాయి వివాహానికి మానవతాదృక్పథంతో మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు సాయం అందించారు. మండలంలోని వీవీరావు పేటకు చెందిన పేదింటి అమ్మాయి సకినపెల్లి నవ్యకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివాహానికి కావాల్సిన సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ట్రస్ట్ నేతృత్వంలో ఇప్పటి వరకు 47 మంది అమ్మాయిల వివాహానికి సహకారం అందించామన్నారు. నవ్య వివాహానికి కావాల్సిన పుస్తెమెట్టెలు, స్టీల్ సామగ్రి, పెళ్లికి పట్టుచీర, 200 మందికి భోజనాలకు కావాల్సిన బియ్యం, వంటసరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీలు గుగ్లావత్ భూమి, తోట సుజాత, ఉపసర్పంచ్‌లు రాజనర్సయ్య, కోడిమ్యాల రవి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రూ.5వేల సాయం

కొండగట్టు: కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన నేరెళ్ల పవిత్ర హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్‌లో సీటు సాధించింది. అయితే, ఆమె కుటుంబం ఇంజినీరింగ్ కోర్స్ చదివించలేని పరిస్థితుల్లో ఉంది. దీంతో బాలిక తన చదువు మానేయ్యాల నుకుంది. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదివారం బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థినికి రూ.5వేలు అందజేశారు. నాయకులు పులి వెంకటేశ్‌గౌడ్, అజయ్‌కుమార్‌గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి

మల్లాపూర్: ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఒక మైలురాయి అని కొనియాడారు. 2003 తర్వాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్ పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం ఎత్తివేసి పాతపెన్షన్ విధానాన్నే తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల బాధ్యులు పాల్గొన్నారు.

తెరపైకి కొత్త పంచాయతీల డిమాండ్

- అధికారుల అలసత్వంతో ఏర్పాటు కాని పంచాయతీలు
- గ్రామపంచాయతీల ఏర్పాటు ప్రతిపాదనలు
- బీర్‌పూర్ మండలంలో ఇందిరానగర్, మంగేళ గొండుగూడెం జీపీలకు అధికారుల నివేదిక


గణేశ్‌పల్లి, పోతారం (సారంగాపూర్)


బీర్‌పూర్ మండలంలోని ఆసునూరి గూడెం గిరిజన తండా

సారంగాపూర్: రాష్ట్ర ఏర్పాటు తరువాత ప్రభుత్వం 500 జనాభా ఉన్న ప్రతి గిరిజన తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం గిరిజన తండాలను మూడు నాలుగింటిని కలిపి ఒక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. దీంతో పాటు గిరిజనేతర శివారు గ్రామాలు 500 జనాభా దాటితే గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. 2018లో జిల్లాలో 60 కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు కాగా, అందులో 20 గిరిజన గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పాటయ్యాయి. జిల్లాలో ప్రస్తుతం గిరిజన గ్రామపంచాయతీలు వీటితో కలిపి మొత్తం 21కి చేరింది. ఆ తరువాత 2019 జనవరిలో అన్ని గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకున్నారు. ఆయా గ్రామపంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను నియమించడం, జనాభా ప్రాతిపదికన గిరిజన, గిరిజనేతర పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చించడంతో పంచాయతీల అభివృద్ధి ముందుకు సాగుతోంది. అదే సమయంలో కొన్ని గిరిజన, గిరిజనేతర గ్రామాలు కొత్తగా పంచాయతీల ఏర్పాటుకు అవకాశం ఉన్నా, అధికారులు కూడ వాటిని పంచాయతీలుగా ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. అధికారులు సరైన నివేదిక సమర్పించకపోవడంతో పంచాయతీల ఏర్పాటుకు నోచుకోలేకపోయాయి.

అవకాశం ఉన్నా.. పంచాయతీలు కాలే..

బీర్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆసునూరిగూడెం, లంబాడితండా, నాయికపుగూడెం (కట్టకింది) ఈ మూడు గూడెంలను కలిపి ఒక గిరిజన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసే అవకాశం ఉండేది. అయినప్పటికీ పంచాయతీగా ఏర్పాటు కాలేదు. బీర్‌పూర్ మండలం తుంగూర్ శివారు గ్రామం కొత్తపేట, సారంగాపూర్ మండలం పోతారం శివారు గ్రామం గణేష్‌పల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసే వీలున్నా, ఏర్పాటు చేయలేదు.

ఇప్పటికే రెండు కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక

బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె శివారు గ్రామం ఇందిరానగర్, మంగేళ గ్రామ గొండుగూడెంలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడానికి ఇటీవల డీపీవో కార్యాలయం నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ గ్రామాలు ప్రస్తుతం ఉన్న గ్రామపంచాయతీలకు ఎంత దూరం, జనాభా, భూముల సర్వే నంబర్లతో వివరాలతో నివేదిక పంపించారు.

గ్రామపంచాయతీల ఏర్పాటుకు పెరుగుతున్న డిమాండ్

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటు మళ్లీ తెరమీదికి వచ్చింది. ఇప్పటికే బీర్‌పూర్ మండలం ఆసునూరిగూడెం, లంబాడితండా, కట్టకింది నాయికపుగూడెం మూడింటిని కలిపి కొత్త గిరిజన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని, కొత్తపేటను కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఇటీవల వినతిపత్రాలు అందజేశారు.

పాలన సౌలభ్యం


లంబాడితండా, కట్టకింది నాయికపుగూడెం, ఆసునూరిగూడెం మూడు గూడెంలను కలిపి గిరిజన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తే పాలనా సౌలభ్యం ఉంటుంది. ప్రత్యేక నిధులు అంది అభివృద్ధి చెందుతాయి. పంచాయతీల ఏర్పాటుకు నాయకులు చొరవ తీసుకోవాలి. – బద్ది గంగాధర్, ఆసునూరిగూడెం, (బీర్‌పూర్)

స్వయం పాలన ఉంటుంది


మాకు గ్రామపంచాయతీ ఏర్పాటు చేస్తే మా పాలన మాకు ఉంటుంది. ప్రభుత్వం అందించి నిధుల ద్వారా మా తండాలు అభివృద్ధి చెందుతాయి. మాకు ప్రత్యేకమైన గుర్తింపు వస్తుంది. స్వయం పాలన తో తండాలు అభివృద్ధి సాధిస్తాయి. – గోపి ప్రసాద్, కట్టకింది నాయికపుగూడెం (బీర్‌పూర్)

రెండు పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదన


బీర్‌పూర్ మండలంలోని ఇందిరానగర్, మంగేళ గొండుగూడెంలను కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం కోరగానే పూర్తి వివరాలతో నివేదికలు, ప్రతిపాదనలు పంపించాం. కొత్తగా మళ్లీ దరఖాస్తులు వస్తే ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అమలు చేస్తాం. – దేవరాజం, జిల్లా పంచాయతీ అధికారి

యువతతో మంత్రి ఆత్మీయ సమ్మేళనం


మంత్రి కొప్పులను కలిసిన యువతీయువకులు

గొల్లపల్లి: హైదరాబాద్‌లో నివసిస్తున్న ధర్మపురి నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు,ఉద్యోగులు,యువతీ యువకులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,విద్యావిధానం, నియోజకవర్గ స్థితి గతులపై వారితో సుదీర్ఘంగా చర్చించారు.

రాష్ట్ర నేతలను కలిసిన బీజేపీ నాయకులు


కిషన్‌రెడ్డి,ఈటలతో జిల్లా నాయకులు

జగిత్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్‌ను ఆదివారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాలలో పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర నాయకులను కలిసిన వారిలో జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఏసీఎస్‌రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, చీటి శేఖర్‌రావు, ఆముద రాజు, బడె శంకర్, మాడిశెట్టి మల్లేశం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ మండల అడ్వైజరీ కమిటీ సమావేశం

వెల్గటూర్: బీఆర్ఎస్ మండల అడ్వైజరీ కమిటీ ఆదివారం కమిటీ అధ్యక్షుడు దోరిశెట్టి వెంకటయ్య ఆధ్వర్యంలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం చేయాలని, అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి సంకోజు తిరుమల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన ఎనగందుల శంకరయ్య (60) వ్యక్తి అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై గజేందర్ కథనం ప్రకారం శంకరయ్య శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీలభ్యం కాలేదు. శంకరయ్య తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వేములవాడకు తరలిన వివిధ పార్టీల నాయకులు

కథలాపూర్: గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. కథలాపూర్ మండలంలోని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు వేములవాడలో ఆదివారం జరిగిన ఆయా పార్టీల సమావేశాలకు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి నేతలు తరలివెళ్లారు. బీజేపీ నియోజకవర్గ సమావేశానికి అస్సాం ఎమ్మెల్యే రావడంతో ఈ ప్రాంత నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు మరోసారి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని నిర్వహించిన సమావేశానికి ముఖ్య నాయకులు వెళ్లారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కిందనిప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎస్సీల సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల సంక్షేమ, అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీల కోసం 100 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తుదన్నారు. దళితబంధు నిరంతర ప్రక్రియ అని అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొల్ముల రమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, నాయకులు రాజు, లక్ష్మీరాజం, బాదినేని రవి, రాజేశం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఎస్ చైర్మన్ గుమ్ముల అంజయ్య, భీమయ్య, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జగిత్యారూరల్: పొరండ్ల గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం అదనపు పనులకు నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే స్పందించి, రూ.2లక్షలు మంజూరుకు హామీ ఇచ్చారు.

ముద్దు రాంక్రిష్ణయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లోని ముద్దు రాంక్రిష్ణయ్య విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై ముద్దు రాంక్రిష్ణయ్య మెమోరియల్ సేవా సదన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివ శంకర్ పలువురు ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలువగా, రూ లక్షలతో నూతన ముద్దు రాంక్రిష్ణయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 2వేల పింఛన్ అమలు లేదు

జగిత్యాల: బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలో రూ. 2వేల పింఛన్ అమలు కావడం లేదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల 10వ వార్డు లింగంపేటలో పలు అభివృద్ధి పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న చోట కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్, డీఈ రాజేశ్వర్, కౌన్సిలర్ భారతి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ కార్మిక సంఘ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: మున్సిపల్ కార్మిక సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా తాండ్ర సుమన్, కోశాధికారిగా లంక శ్రీకాంత్, సలహాదారులుగా మధు రమ్మ, నర్సయ్య, నాగుల రవి, లోకిని మహేశ్, ఇబ్రహీం, నరేశ్‌ను ఎన్నుకున్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

జగిత్యాల: సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జేఏసీ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు బర్ల నారయణ, జిల్లా ప్రధానకార్యదర్శి కుడుకల రవీందర్, అనుమల్ల శ్రీనివాస్, ట్రెజరర్ రవి, ఎండీ ఫరూఖ్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. టీఎస్ఎస్ జాక్ పిలుపు మేరకు భవిష్యత్తులో ధర్నా, సమ్మె, ర్యాలీ లాంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

మెట్‌పల్లి: రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు రైతులను ఆదుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీయా యోజన పథకాన్ని ప్రారంభిస్తే...దానిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల రైతులు ఎంతో నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంట కాల్వలు మరమ్మతు చేయాలి


గడ్డి పెరిగిన ఎస్సారెస్పీ పంట కాలువ

పెగడపల్లి: మండలంలోని రాములపల్లి గ్రామ శివారులోని పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని తీయించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఎస్సారెస్పీ డీ– 83 పరిధిలోని ఉప కాల్వలు, స్థానిక దోమకుంట చెరువు కింద ఉన్న పిల్లకాల్వల ఆధారంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. వీటికి మరమ్మతులు లేక కాలువల్లో పూడిక మట్టి నిండుకుందని, దీంతో పంటలకు సక్రమంగా నీరందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఉపాధిహామీలో గ్రామ శివారులో ఉన్న కాలువలన్నింటినీ మరమ్మతు చేయించాలని అధికారులను కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలు మార్లు మండల పరిషత్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించినా ఫలితం లేకుండా పోతుందని వాపోయారు. గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేసి అధికారులకు అందించినా.. పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంట కాలువల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో పుల్లయ్యను సాక్షి సంప్రదించగా రైతుల విన్నపం మేరకు కాలువల్లో పూడిక మట్టితీత పనుల మంజూరు కోసం ప్రతిపాదన పంపామన్నారు. మంజూరు రాగానే పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకే మద్దతు


మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారాం

పెగడపల్లి: ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వని పార్టీలకు మాదిగల ఓట్లు అడిగే హక్కులేదని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం అన్నారు. పెగడపలిలో ఆదివారం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం త్వరలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీలకే మాదిగల మద్దతు ఉంటుందని, మద్దతివ్వని పార్టీలు గ్రామాల్లోకి వచ్చి మాదిగల ఓట్లు అడిగితే తగిన రీతిలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు మాదిగ యువకులు ఐక్యమత్యమై పోరాడాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో జిల్లా కోకన్వీనర్ సతీశ్, ఎమ్మార్పీఎస్ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జీ మహేందర్, నాయకులు రాజు, అంజయ్య, దుర్గాప్రసాద్, దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి


బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి రూరల్: మండలంలోని చౌలమద్ది–మారుతినగర్ మధ్యలో పెద్దవాగుపై చేపడుతున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక రైతులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదకొండేళ్లైన బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడం విడ్డూరమన్నారు. పనులు పూర్తికాకపోవడంతో పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు 12 కి.మీ మేర తిరిగి వెళ్తున్నారన్నారు. రైతులు పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పెద్దాపూర్ లో మల్లన్న స్వామిని దర్శించుకుని గ్రామస్తులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి,మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి,నాయకులు చిన్నసాయబ్, రమేశ్ ,శేఖర్, లింగం, శ్రీనివాస్, మారుతి, రాంప్రసాద్, లక్ష్మణ్, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్


కోనరావుపేటలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మెట్‌పల్లి రూరల్: ప్రమాదమని తెలిసినా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేసే విషయంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు,మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని కోనరావుపేట గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయలేదు. ఈ మార్గం గుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే పంట పొలాలు ఉన్నాయి. ఎద్దైనా ప్రమాదం జరగక ముందే కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ నూతన కార్యవర్గం


ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గంను ఆదివారం మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. అధ్యక్షుడిగా గుండి కొంరయ్య, ఉపాధ్యక్షుడిగా నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా నక్క కొంరయ్య, కోశాధికారిగా గంగన్న, కార్యదర్శిగా గడ్డి కొంరయ్య, ముఖ్య సలహాదారులుగా దాసరి నారాయణ, తాండ్ర తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అల్లాడి వేణు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఓరుగంటి నడిపి గంగయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ షకీల్‌ను నియమించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ షకీల్ మండల అధ్యక్షుడు నిషాంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో భీంరాజ్‌పల్లి సర్పంచ్ సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

రాయికల్/మల్యాల/మెట్‌పల్లి/కొండగట్టు/పెగడపల్లి/కథలాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయికల్,మల్యాల,మెట్‌పల్లి,కొండగట్టు,పెగడపల్లి,కథలాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రాజీవ్ గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.